మావోయిస్టుల కుట్ర భగ్నం

25 కిలోల మందుపాతర నిర్వీర్యం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 2: భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను ఆదివారం జవాన్లు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతాపూర్–ఉసుర్ మార్గం మధ్యలో రోడ్డుని తవ్వి మావోయిస్టులు మందుపాతరని అమర్చారు. అదే సమయంలో అటుగా వెళ్లిన భద్రతా దళాలు మందుపాతరని గుర్తించి సుమారు 25కేజీల కంటైనర్‌లో పాతిపెట్టిన ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజీవ్ డివైస్(ఐఈడీ)ని తొలగించారు. ఈ మందుపాతరకు కార్డెక్స్ వైర్‌ను అనుసంధానం చేస్తూ రోడ్డు నుంచి సుమారు 400మీటర్ల దూరం వరకు అమర్చారు. ఆ ప్రాంతంలో రోడ్డు గుంతలా ఉండడంతో పాటు వైరుని గమనించిన జవా న్లు మందుపాతరను తవ్వించి, జేసీబీ సహాయంతో అక్కడి నుంచి తొలగించి నిర్వీర్యం చేశారు.

కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 2: బూర్గంపహాడ్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న బాలిక అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక (17) వదిన చింతా సుమలత వచ్చి ఆమెకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసివ్వడానికి రెండు గంటలు అనుమతి కావాలని స్పెషలాఫీసర్ సుశీలకు చెప్పి లెటర్ రాసి తానే సంతకం పెట్టి శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆ విద్యార్థిని తీసుకువెళ్లింది. సాయంత్రం వరకు కళాశాలకు తిరిగి రాకపోవడంతో సుమలతకు కళాశాల స్పెషలాఫీసర్ సుశీల ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. విద్యార్థిని ఆచూకీ కోసం ప్రయత్నించగా సుమలత సదరు బాలికను చింతా సిసింద్రీ అనే వ్యక్తి మోటారుసైకిల్‌పై పంపినట్లు తెలిసి ఆదివారం బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళాశాల స్పెషలాఫీసర్ మాలోత్ సుశీల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 2: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మణుగూరు పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని కాళీమాత ఏరియాలో నివాసముంటున్న రావుల పల్లి ప్రదీప్(29) టాటాషోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కావడంతో కమలాపురంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై తన బావతో కలిసి వెళ్తుండగా వంద పడకల ఆసుపత్రి సమీపంలోకి రాగానే ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ముందున్న కారును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న ప్రదీప్ కిందపడటంతో లారీ వెనుక టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న ప్రదీప్ బావకు గాయాలయ్యాయి. మృతుడు ప్రదీప్ మున్సిపాలిటీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కుమారుడిగా పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

అశ్వాపురం, ఫిబ్రవరి 2: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తికి కారు ఢీకొని మృతిచెందిన ఘటన ఆదివారం మొండికుంటలో చోటుచేసుకున్నది. ఎస్సై సైదా రావూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొండికుంట పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న చాతర్ల వెంకన్న (64) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా మణుగూరు నుంచి కొత్తగూడెం వెళ్తున్న కారు వచ్చి సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్సై సైదా రవూఫ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 2: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నకిరిపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... టేకులచెరువు గ్రామానికి చెందిన చింతనిప్పు మురళి(40) ద్విచక్రవాహనంపై పని నిమిత్తం లక్ష్మీపురం వచ్చి తిరిగి వెళ్తుండగా నకిరిపేట సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన విషయం తెలుసుకున్న ఎస్సై రాజేశ్ అక్కడకు చేరుకుని మృతికి గల కారణాలను సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక లారీ పట్టివేత

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని నాగారం చెక్‌పోస్ట్ వెనుక మార్గంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు హచ్చా, రవి ఆదివారం స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి, లారీని తహసీల్ కార్యాలయానికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 2: పేకాట ఆడుతున్న పలువురు జూదరులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గాండ్లగూడెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్సై యయాతి రాజు సిబ్బందితో కలిసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6,200 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టేకు కలప పట్టివేత

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని నడిమిగూడెం గ్రామ పంచాయతీ లొద్దిగూడెం గ్రామ శివారులో అక్రమంగా నిలువ ఉంచిన కలపను ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు ఎఫ్‌ఆర్‌వో చలపతి ఆదేశానుసారం టీ.వెంకన్న సెక్షన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. పట్టుకున్న టేకు కలప విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని తెలిపారు. కలపను ఇల్లెందు ఫారెస్టు డిపోకు తరలించినట్లు తెలిపారు. దాడిలో ఫారెస్టు సిబ్బంది లక్ష్మణ్, నరేశ్, జితేందర్, వీరేందర్ పాల్గొన్నారు.

కృష్ణయ్యకు మాజీ ఎమ్మెల్యే నివాళి

కృష్ణయ్య చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 2: మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన యర్రంశెట్టి చంద్రశేఖర్ తండ్రి కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం జరిగిన కృష్ణయ్య దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు హాజరై కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, పొట్టా రాజులు, చందా లక్ష్మీనర్సు తదితరులు ఉన్నారు.

విత్తనాల విక్రేతలపై పోలీసులకు ఫిర్యాదు

టేకులపల్లి, ఫిబ్రవరి 2: తమకు విత్తనాలను అంటగట్టి మోసగించారంటూ బాధిత రైతులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విలేకరులకు ఇలా వివరాలు వెల్లడించారు. మండలంలోని చంద్రుతండా, ఒడ్డుగూడెం గ్రామ రైతుల వద్దకు గత డిసెంబర్‌లో స్థానిక రైతులు లక్కినేని సురేందర్‌రావు, భూక్యా రాజా కలిసి.. వసుధ మొక్కజొన్న విత్తనాల కంపెనీ ప్రతినిధులను తీసుకొచ్చారు. మొక్కజొన్న ఆడ–మగ సాగు చేస్తామంటే.. ఎకరాకు ముందుగా రూ.10వేలు పెట్టుబడి కింద ఇస్తామని చెప్పారు. పంట చేతికి వచ్చాక కంపెనీ కొంటుందని అన్నారు. దిగుబడి సరిగ్గా రాకపోతే ఎకరాకు రూ.50వేలు ఇస్తామన్నారు. దీనికి ఒప్పుకున్న రైతులతో సురేందర్‌రావు, రాజా ఒప్పందం చేసుకుని, విత్తనాలు ఇచ్చారు. ఆ రైతులు వాటితో మొత్తం 78 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. పది రోజుల తర్వాత, సదరు కంపెనీ ప్రతినిధులు వచ్చి చూశారు. 'వరి సాగు చేసిన భూమిలో (35 ఎకరాలలో) ఆడ–మగ మొక్కజొన్న సాగు రాదు. సాగు చేయవద్దు' అని చెప్పారు. దీనికి ఆ రైతులు అభ్యంతరం చెప్పడంతో లక్కినేని సురేందర్‌రావు, భూక్యా రాజా జోక్యం చేసుకుని, నష్ట పరిహారంగా రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఆ బాధిత రైతులకు నష్ట పరిహారాన్ని కంపెనీ చెల్లించలేదు. దీనిపై ఆ రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'ముందే చెప్పాం..'

దీనిపై మొక్కజొన్న విత్తనాలను అందించిన వసుధ కంపెనీ ప్రతినిధి రాజేందర్‌రెడ్డిని 'నమస్తే' వివరణ కోరింది. ''టేకులపల్లి మండలంలో 250 ఎకరాల్లో ఆడ–మగ మొక్కజొన్న సాగు కోసం లక్కినేని సురేందర్‌రావుకు మేము విత్తనాలు ఇచ్చాం. వరి సాగు చేసిన భూమిలో సాగు చేయవద్దని ముందుగానే స్పష్టంగా చెప్పాం. వరి సాగు చేసిన భూముల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతుల వద్దకు పది రోజుల లోపులోనే వెళ్లి.. సాగు చేయవద్దని, పంట రాదని చెప్పాం. వారితో సాగు చేయించింది లక్కినేని సురేందర్. ఎకరాకు రూ. 20 వేలు నష్ట పరిహారం ఇస్తానని ఆ రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారంగా వారికి ఆయన నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో సమస్య వచ్చింది'' అని వివరించారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

చంద్రుగొండ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) నాయకుడు ఎస్కే ఉమ్మర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం చంద్రుగొండలో ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

హిడ్మా స్థానంలో పతిరామ్?

- పీఎల్‌జీఏ చీఫ్‌ను బయటకు రప్పించేందుకు ఎత్తుగడలా?
- ప్రస్తుత పరిణామాల దృష్ట్యా మావోయిస్టు పార్టీ నిర్ణయమా?
- సోషల్ మీడియాలో విస్తృత చర్చ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 2: మావోయిస్టు పార్టీ అగ్ర నేతల్లో ఒకరు.. రక్షణ బలగాలకు 'మోస్ట్ వాంటెడ్'గా ఉన్న హిడ్మా.. ఇప్పుడు ఏ బాధ్యతల్లో, ఎక్కడ (ఏ ప్రాంతంలో) ఉన్నారు..? ఆయన స్థానంలో వేరొకరిని మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నియమించిందా..?– సోషల్ మీడియాలో ఇప్పుడ ఈ చర్చ జోరుగా సాగుతున్నది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీఎస్‌జెడ్‌సీ) సభ్యుడు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 1వ బెటాలియన్ కమాండర్‌గా ఉన్న మాద్వి హిడ్మా.. అలియాస్ సంతోష్‌ను ఆ స్థానం నుంచి కేంద్ర నాయకత్వం తప్పించిందని.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మరో కీలక నేత, రక్షణ బలగాలకు 'మోస్ట్ వాంటెడ్'గా ఉన్న నేత పతిరామ్ మాంఝీ.. అలియాస్ తుఫాన్ దా.. అలియాస్ అనల్ దా.. అలియాస్ పతిరామ్ మారండి.. అలియాస్ తరు మాంఝీని నియమించిందని చర్చ సాగుతున్నది.

నిజమేనా..? ఊహాగానమా..? వ్యూహమా..?

హిడ్మాను మార్చడం నిజమేనా..? కేవలం ఊహాగానమా..? లేదా, రక్షణ బలగాలే తమ వ్యూహంలో భాగంగా ఈ చర్చను బయటకు తీసుకొచ్చిందా..? అనే ప్రశ్నలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 'ఇప్పటికే పీఎల్‌జీఏ చీఫ్‌గా వ్యవహరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిక్కకుండా, ఆపరేషన్ 'కగార్'ను కంగారెత్తిస్తున్న హిడ్మాను మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటి..? 'ఆపరేషన్ కగార్'ను ధీటుగా ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందా..? లేదా, మాస్టర్ మైండ్ హిడ్మాను కలుగులో నుంచి బయటకు రప్పించేందుకు రక్షణ బలగాలే ఈ ప్రచారాన్ని తెర పైకి తీసుకొచ్చాయా..?'– ఇలా, సోషల్ మీడియాలో రకరకాలుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి.

ఇద్దరూ 'ఖరీదైన' నేతలే..!

రక్షణ బలగాలకు 'మోస్ట్ వాంటెడ్'గా, మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా ఉన్న హిడ్మా, పతిరామ్.. ఇద్దరూ 'ఖరీదైన' వారేనని చెప్పొచ్చు. ఎందుకంటే, హిడ్మా తలపై ఇప్పటికే సుమారు రూ.1.50 కోట్ల రివార్డు ఉంది. జార్ఖండ్ రాష్ట్రం గిరిధీ జిల్లా పిర్తంత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఝుర్వా గ్రామానికి చెందిన పతిరామ్ తలపై కూడా సుమారు రూ.కోటి రివార్డు ఉంది. వీరిద్దరూ సమ స్థాయిగల నేతలేనని సమాచారం. జార్ఖండ్ రాష్ట్రం ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారిన కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ పతిరామ్.. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తోపాటు హిడ్మా కూడా తప్పించుకున్నాడనే సమాచారం తెర మీదకు వచ్చింది. దామోదర్ క్షేమంగా ఉన్నాడని మావోయిస్టు పార్టీ కూడా అధికారికంగా ప్రకటించింది. హిడ్మా ప్రస్తావన మాత్రం మావోయిస్టు పార్టీ నుంచి రాలేదు.

'కగార్'ను ధీటుగా ఎదుర్కొనేందుకేనా..?

సోషల్ మీడియాలో చర్చల్లో మరో కీలకాంశం కూడా ప్రస్తావనకు వస్తున్నది. మావోయిస్టులకు అత్యంత రక్షణ కవచంగా ఉన్న కీకారణ్యంలోకి, రహస్య స్థావరాల్లోకి కూడా రక్షణ బలగాలు చొచ్చుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, దీనిని ధీటుగా ఎదుర్కొనేలా వ్యూహాన్ని సిద్ధం చేసే బాధ్యతను హిడ్మాకు మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం అప్పగించిందన్న చర్చ కూడా సాగుతున్నది. ఆయన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ బలగాలకు చిక్కకుండా అబూజ్‌మడ్ అడవులు, కర్రి గుట్టలు కేంద్రంగా పావులు కదుపుతున్నారని.. అందుకే ఆయన బాధ్యతలను పతిరామ్‌కు పార్టీ అప్పగించిందని కూడా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ చర్చోపచర్చలపై ఇప్పటివరకూ మావోయిస్టు పార్టీగానీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంగానీ ఏ రూపంలోనూ స్పందించలేదు.

అండర్-19 వరల్డ్ కప్‌లో మెరిసిన గొంగడి త్రిష

చాంపియన్ ట్రోఫీతో అండర్-19 మహిళల టీ20 టీమిండియా జట్టు

భద్రాచలం, ఫిబ్రవరి 2: భద్రాచలం ప్రాంతానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి గొంగడి త్రిష భారత జట్టు నుంచి అండర్–19 వరల్డ్‌కప్‌లో సౌతాఫ్రికా జట్టుపై గెలిచి మరోసారి మెరిసింది. అండర్–19 మహిళల జట్టు నుంచి త్రిష మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడి 309 పరుగులు చేసి ఏడు వికెట్లను తీసి తన ప్రతిభను ప్రపంచ నలుదిశలా చాటింది. ఫైనల్ మ్యాచ్‌లో 11.2 ఓవర్లలో 44 పరుగులు చేసి, మూడు వికెట్లు తీసింది. భారత జట్టు నుంచి త్రిష ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో ఆడి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవల స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా తన ప్రతిభను చాటుకుంది. పట్టణంలో ఫైనల్ మ్యాచ్‌లో త్రిష చూపిన ప్రతిభను అభినందిస్తూ అభిమానులు కేక్ కట్ చేసి విజయోత్సవ సంబురాలు జరిపారు.

త్రిష ప్రతిభ తెలంగాణకు గర్వకారణం: మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

అండర్–19 మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించడం పట్ల మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం వాసి గొంగడి త్రిష ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, టీమిండియా ప్రధాన జట్టులో చోటు సంపాదించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

త్రిష మరిన్ని విజయాలు సాధించాలి: మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): అండర్–19 టీం ఇండియాలో ప్రపంచ కప్పును గెలుచుకోవడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లా భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష చూపిన ప్రతిభ అబ్బురపరిచిందన్నారు. ఇండియాలో తెలంగాణ అమ్మాయి చరిత్ర సృష్టించిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సొంత చేసుకోవాలని కోరారు.

త్రిషను అభినందించిన కలెక్టర్ జితేష్

అండర్–19 క్రికెట్ మహిళల ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన భద్రాచలానికి చెందిన గొంగడి త్రిషను కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. ప్రజల తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. కప్ సాధించడానికి త్రిష ముఖ్యకారణమన్నారు. ప్రపంచ వేదికపై భద్రాద్రి పేరును నిలబెట్టిందన్నారు.

కేసీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా ప్రతినిధి

కేసీఆర్‌తో ఇల్లెందు నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధి వినయ్

ఇల్లెందు, ఫిబ్రవరి 2: మాజీ సీఎం కేసీఆర్‌ను ఇల్లెందు నియోజక వర్గ సోషల్ మీడియా ప్రతినిధి సీహెచ్ వినయ్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఆదివారం కలిశారు. వినయ్ తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ ఆశీస్సులు తీసుకునేందుకు వెళ్లానని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అధికార పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు.

భద్రాద్రి రామయ్య నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 2: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అన్నదానానికి భక్తుల వితరణ

అన్నదానానికి వితరణ చేస్తున్న భక్తులు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదానం నిమిత్తం విశాఖపట్నం చిట్టివలసకు చెందిన భక్తులు పోరం రామారావు, పట్నాయక్ సరోజిని దంపతులు రూ. 2లక్షలు ఆదివారం అందజేశారు. అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు

నల్లగొండ, ఫిబ్రవరి 2: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నుంచి 10వ తేదీ వరకు నల్లగొండలోని కలెక్టరేట్‌లో నామినేషన్లను స్వీకరిస్తారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని అభ్యర్థులు నల్లగొండలోనే నామినేషన్లు వేయనున్నారు. ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 3:00గంటల వరకు నామినేషన్లు తీసుకోనున్నారు. ఈ నెల 11న స్క్రూట్నీ, 13న ఉపసంహరణ అనంతరం 27న పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఫలితాలను లెక్కించనున్నారు. దీనికి సంబంధించి ఎన్నికల యంత్రాంగం జిల్లాలో 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ఆయా పోలింగ్ కేంద్రాల్లో 24,905 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ కప్ విజేతగా పోలీస్ టీం

విజేతగా నిలిచిన పోలీస్ టీం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 21: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ కప్ 2025 ఆదివారం మణుగూరు పట్టణంలోని భద్రాద్రి స్టేడియంలో నిర్వహించారు. టోర్నమెంట్‌లో ప్రెస్‌క్లబ్ టీం, పోలీస్ టీం, సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారుల టీం పాల్గొన్నారు. హోరాహోరిగా జరిగిన ఈ పోటీల్లో పోలీస్ టీం ఫైనల్ చేరుకుని విజేతగా నిలిచింది. పోలీస్‌టీంకు సింగరేణి అధికారులు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మెచ్చా

మోహనరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, ఫిబ్రవరి 2: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని సుధాపల్లిలో చెలికాని మోహనరావు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మోహనరావుకు శాలువా కప్పి సత్కరించారు. అ నంతరం చెన్నువారిగూడెంలో కట్టా ఎర్రప్ప తండ్రి రాముడు, గండుగులపల్లిలో కూకలకుంట జగపతిరావు కోడలు సుధారాణి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట రైతుబంధు మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, నాయకులు సోయం వీరభద్రం, తుమ్మల లక్ష్మణ్‌రావు, మొగిలి కృష్ణ, వాడే వీరాస్వామి, బండారు సూర్యనారాయణ, యలమంచి చంద్రశేఖర్‌రావు, రత్నాకర్‌రావు, రెడ్డిమళ్ల నాగయ్య, మాటూరి రాజ్‌శేఖర్, తుర్రం శ్రీను, గాంధీ, నాగేంద్ర, శ్రీను పాల్గొన్నారు.

ఏఎస్సై నాగరాజుకు రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని కొమరారం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పసుపునూరి నాగరాజు జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకం, రూ.20 వేల రివార్డును అందుకున్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో నాటి రాష్ట్ర డీజీపీ బాసిత్, ఐజీ పూర్ణ చందర్‌రావు చేతులమీదుగా రివార్డులు తీసుకున్నారు. 2014లో బెస్ట్ ఇంటలిజెన్స్‌గా నాటి జిల్లా కలెక్టర్‌తో అవార్డులు అందుకున్నారు. సేవా పతకాన్ని అందుకున్న ఏఎస్సై నాగరాజును ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, గుండాల సీఐ రవీందర్, కొమరారం ఎస్సై, సిబ్బంది అభినందించారు.

సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా భావ్‌సింగ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రొంపేడు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడం అలవాటుగా చేసుకుందన్నారు. ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తారని లబ్ధిదారులు వేచి చూస్తుంటే రెండో సారి ఇందిరమ్మ కమిటీలను స్థానిక ప్రజాప్రతినిధులతో సర్వే చేయించిందన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోమన్న, భూక్యా రాంజి, జలపుల మోతీలాల్, బానోత్ భద్రమ్మ, ధరంసోత్ లక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలను నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

దుమ్ముగూడెం: మాట్లాడుతున్న కణితి రాముడు, దమ్మపేట: నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 2: తెలంగాణ ప్రజలను కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, మండల కోకన్వీనర్ ఎండీ.జానీపాషా అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలకు గుండు సున్నా పెట్టిందన్నారు. విభజన సమయంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు సైతం ఇవ్వకపోగా ప్రాజెక్టులకు ఇవ్వాల్సిన జాతీయ హోదాను సైతం మరిచిందని అన్నారు. కేవలం ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను అణగదొక్కేలా కేంద్ర బడ్జెట్ ఉందని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, తూరుబాక మాజీ సర్పంచ్ భూక్యా చందు, సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు దామెర్ల శ్రీనివాసరావు, నాయకులు వాగే వెంకటేశ్వరరావు, బానోత్ నగేశ్, వాగే కృష్ణ, కుమ్మరికుంట సూర్య, బిలపాటి లక్ష్మణ్‌రావు, తంతరపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మొండిచేయి

దమ్మపేట, ఫిబ్రవరి 2: పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉపాధి కూలీలకు మొండిచేయి చూపిందని సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్) అనుబంధ ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము అన్నారు. ఆదివారం దమ్మపేటలో ఉపాధికూలీలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుటిలప్రయత్నాలు చేస్తుందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ కూలీలను చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. నాయకులు, ఉపాధి, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

కరకగూడెం, ఫిబ్రవరి 2: నిధుల కేటాయింపులో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య ధ్వజమెత్తారు. ఆదివారం కరకగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నానే అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది, కాంగ్రెస్‌కు ఎంఐఎంతో కలుపుకుని తొమ్మిది మంది ఎంపిలున్నారు. కానీ కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేసారన్నారు. అదే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉండి ఉంటే కొట్లాడి నిధులు తీసుకువచ్చేవారన్నారు. కేంద్రం బీజేపీ పాలిత రాష్ట్రాలను ఒక రకంగా, బీజేపీయేతర రాష్ట్రాలను మరో రకంగా చూడడం అన్యాయమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని అభివర్ణించారు.

వడ్డెర రాజుల సంఘం ఆధ్వర్యంలో కనకమేడలకు సన్మానం

హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఘసంఘం బాధ్యులు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 2: మండలంలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్‌ను వడ్డెర రాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర రాజుల సంఘం మండల అధ్యక్షుడు బత్తుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు దేవళ్ల దాసు, కార్యవర్గ సభ్యులు చల్లా బలరామ్, ఉప్పు శ్రీను, వేముల నరేశ్, బత్తుల నవీన్‌కుమార్, గుంజా కిరణ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

చంద్రుగొండ, ఫిబ్రవరి 2: ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు షరీఫ్ డిమాండ్ చేశాడు. ఆదివారం చంద్రుగొండలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దాసరి కృష్ణను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. షరీఫ్ మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్లకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, బ్యాంకు రుణాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు లక్ష్మణ్, రాములు, సతీశ్, నాహిత్, క్రాంతి, రావి, చారి తదితరులు పాల్గొన్నారు.

ధరల ప్రకారం ప్రోగ్రాంలు చేయాలి

దుమ్ముగూడెం, జనవరి 2: అల్బమ్‌లోని ధరల ప్రకారం మాత్రమే ఫొటోగ్రాఫర్లు ప్రోగ్రాంలు చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు మహేంద్రనాథ్ తెలిపారు. ఆదివారం ములకపాడులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ల అభిప్రాయంతో నిర్ణయించిన ధరలను ప్రకటించి ఆ ప్రకారం ధరలతో ఫొటో ఆల్బమ్, డిజైనింగ్, వీడియో తదితర వాటిని అమలుచేయాలని కోరారు. ప్రస్తుత పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఈ ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా శ్రీరామమూర్తి, కార్యదర్శి రవి, కోశాధికారి శ్యామల, రవివర్మ, ఫొటోగ్రాఫర్లు కణితి రాజు, పవన్, పిలకా నాగేశ్వర రెడ్డి, శ్రీను, జంపన్న, రమేశ్, సాయి, అనిల్, బాబి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ సారపాకకు ఎన్నికల కళ!

పంచాయతీ ప్రజల్లో వీడనున్న సందిగ్ధత

సారపాక పంచాయతీ కార్యాలయం

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 2 : పారిశ్రామిక వాడ సారపాకకు ఎన్నికల కళ వచ్చినట్లు కనిపిస్తున్నది. తాజాగా ఎంపీటీసీల స్థానాల ప్రకటన వెలువడటంతోపాటు సారపాకలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు ముసాయిదా జాబితా ప్రకటన రావడంతో ప్రజలు ఈసారి పంచాయతీ ఎన్నికలు కచ్చితంగా జరుగుతాయనే ఆలోచనలో పడ్డారు. సుమారు 33వేల జనాభాకు పైగా ఉన్న సారపాక పంచాయతీలో 2018 నుంచి ఎన్నికలు జరగడం లేదు. దీంతో పంచాయతీ అభివృద్ధి కుంటుపడిన నేపథ్యంలో ఈసారైనా ఎన్నికలు జరుగుతాయా...? లేదా? అని ఎదురుచూస్తున్న ప్రజలకు సందిగ్ధత వీడినట్లయింది. 2019లో మునిసిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో పంచాయతీ ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత చేపట్టిన పురపాలిక ఎన్నికలోనూ సారపాక పేరు కనిపించలేదు. దీంతో పంచాయతీ ఎన్నికలు అసలు జరుగుతాయా... లేదా అనేది తెలియక ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు.

అయితే గత ఆరేళ్లుగా పాలకవర్గం లేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యకలాపాలు నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడాది కూడా దాటింది. ఈ తరుణంలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి అధికారులు కూడా ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. ఆ సమయంలో పంచాయతీ ప్రజలు, నేతలు ఇక్కడ ఎన్నికలు ఉంటాయిలే అనుకున్నారు. ఆ సమయంలో జాబితాలో సారపాక పంచాయతీ పేరు రాలేదు. అయితే ముందుగానే ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు మండల అధికార యంత్రాంగం ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా జాబితాను ప్రవేశపెడటంతో ఆ ముసాయిదా జాబితాలో సారపాకలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉండటంతో కచ్చితంగా పంచాయతీ ఎన్నిక ఉంటుందని నేతలు, ప్రజలు భావిస్తున్నారు. తాజాగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండల అధికార యంత్రాంగం ఓటరు జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

పాలకవర్గం లేకుండానే....

పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో 33వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. పారిశ్రామికంగా ముందంజలో ఉండి అన్నిరకాల ఉద్యోగ, వ్యాపార సముదాయంగా నిలిచింది. పెద్ద పంచాయతీగా సారపాక ఉన్నప్పటికీ గత ఆరేళ్లుగా పాలకవర్గం లేకుండానే అధికారుల పాలనలో కొనసాగుతోంది. పాలకవర్గం లేకపోవడంతో అనుకున్న స్థాయిలో పంచాయతీ అభివృద్ధి జరగడంలేదని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. తాజాగా ఎంపీటీసీ స్థానాలకు ముసాయిదా జాబితాను ప్రకటించడం... అందులో సారపాకకు సంబంధించి 6 ఎంపీటీసీ స్థానాలను కేటాయించడంతో త్వరలో సారపాక పంచాయతీకి కూడా ఎన్నికలు జరుగుతాయని పారిశ్రామిక వాడలో నేతలతో పాటు ప్రజలు కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు జరిగితే సారపాక పంచాయతీ మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు.